సాక్షి రంగారెడ్డి

గురువారం । 21 । ఆగస్టు । 2025



సెకండ్ 'హ్యాండ్'!

మోసగాళ్లు తెలివిమీరుతున్నారు. జనాన్ని మోసం చేసి మనీ సంపాదించడం కోసం కొత్తదారులు వెతుక్కుంటున్నారు. 8లో▸



ప్రభుత్వ ఆఫీసుల్లో అవినీతి!

ప్రభుత్వ ఆఫీసుల్లో అవినీతి రాజ్యమేలుతోంది. లంచావతారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. 8లో▸



వర్షాలకు కూలిన ఇళ్లు

భారీ వర్షాల కారణంగా చేవెళ్ల మండలంలోని ఆలూరు గ్రామంలో ఓ పాత ఇల్లు కూలింది. 8లో▸

న్యూస్‌రీల్

నిరక్షరాస్యుల వివరాలు నమోదు చేయాలి

జిల్లా వయోజన విద్యా డైరెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న నాగలక్ష్మి

షాబాద్: సాక్షరత నవభారత్ విలేజ్ రిసోర్స్ పర్సన్‌లు నిరక్షరాస్యులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వయోజన విద్యా డైరెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో సాక్షరత నవభారత్ విలేజ్ రిసోర్స్ పర్సన్‌లకు మండల స్థాయి శిక్షణ జరుగుతున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 70 వేల మంది నిరక్షరాస్యులను గుర్తించి 40 వేల మందిని ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. రిసోర్స్ పర్సన్స్ గ్రామస్థాయిలో విద్యా వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ అందరికీ వంద శాతం చదువు నేర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో 15 ఏళ్లు దాటిన నిరక్షరాస్యులను గుర్తించి ఆన్‌లైన్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ ఆనంద్‌కుమార్, రిసోర్స్ పర్సన్స్ సింహాద్రినాయుడు, ఆంజనేయులు, ఉపాధ్యాయులు, గ్రామ విద్యావలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి చైర్మన్ నియామకం నిలిపివేత

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్‌గా కొత్తపల్లి జైపాల్‌రెడ్డిని నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే నిలిపి వేయాలంటూ మంగళవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఏడాదిన్నర క్రితం సంఘం చైర్మన్‌గా ఎన్నికైన చేగూరి భరత్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ని పదవి నుంచి తొలగించి, ఇన్‌చార్జి చైర్మన్‌గా కొత్తపల్లి జైపాల్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా సహకార శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై భరత్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు భరత్‌కుమార్‌ను తొలగింపు ప్రక్రియతో పాటు జైపాల్‌రెడ్డిని ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులన్నింటినీ నిలిపివేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. దీంతో బాటసింగారం సహకార సంఘం వివాదం మరోసారి తెరపైకి వచ్చింది.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కడ్తాల్: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో గణితం బోధించుటకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌ఓ అనిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ పూర్తి చేసిన మహిళ అభ్యర్థుల నుంచి అర్జీలు తీసుకుంటునట్లు పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీలోగా స్థానిక కేజీబీవీలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



మురళి (ఫైల్)

నందిగామ: విద్యుదాఘాతంతో ఓ యువ రైతు మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా రంగాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మురళి(33) బుధవారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. బోరుమోటారు ఆన్ కాకపోవడంతో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. కనెక్షన్లను గమనిస్తున్న క్రమంలో విద్యుత్ తీగ తగిలి కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యు లు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య శ్రుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాష్‌రూం క్లీనింగ్ లిక్విడ్ తాగి యువకుడి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: మద్యం తాగొద్దని తల్లి, సోదరుడు మందలించారని ఓ యువకుడు వాష్‌రూం క్లీనింగ్ లిక్విడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రవికుమార్ కథనం ప్రకారం..ఆదిబట్లకు చెందిన మహేందర్(28) నిత్యం మద్యం తాగి కుటుంబ సభ్యులను వేధించే వాడు. ఎన్నిసార్లు చెప్పినా వైఖరి మారలేదు. ఇదే విషయమై తల్లి, సోదరుడు మంగళవారం అతన్ని మందలించారు. దీంతో మనస్తాపానికి గురై వాష్‌రూం క్లీనింగ్ లిక్విడ్ తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉస్మానియాకి తరలించగా పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదుశాతమే క్లియర్!

పారదర్శకత లోపించిన రెవెన్యూ సదస్సులు

- జిల్లా వ్యాప్తంగా 22,139 అర్జీల స్వీకరణ
- 1,011 ఆమోదం.. మరో 50 తిరస్కరణ
- నోటీసులతో సరిపెడుతున్న అధికారులు
- ఆందోళనలో భూ బాధితులు



చేవెళ్ల మండలం బస్తేపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సు (ఫైల్)

సాక్షి, రంగారెడ్డి జిల్లా: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం జూన్ మూడు నుంచి 21 వరకు గ్రామాల వారీగా భూభారతి సదస్సులు నిర్వహించింది. జిల్లాలోని 27 మండలాల పరిధిలో 613 రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి మొత్తం 22,139 దరఖాస్తులను స్వీకరించారు. వీటిలో 8,966 మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించిన అర్జీలుండగా.. 1,652 సక్సేషన్, 1,557 నిషేధిత జాబితా నుంచి తొలగింపు, 1,158 డీఎస్ పెండింగ్, 1,932 విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, 967 భూ స్వరూపంలో మార్పులు, 742 పేర్ల నమోదులో దొర్లిన తప్పులను సరి చేయడం, 656 అసైన్డ్ భూముల సమస్యలు, 142 ఓఆర్‌సీ నాట్ ఇష్యూడ్, 2217 ఇతర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులున్నాయి. ఆయా దరఖాస్తులన్నింటికీ ఆగస్టు 15 లోగా ఓ పరిష్కార మార్గం చూపించాల్సిందిగా జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. ఆ మేరకు రెవెన్యూ అధికారులు దరఖాస్తుల పరిశీలన పేరుతో రోజుల తరబడి హడావుడి చేసి బాధితులకు నోటీసులు జారీ చేశారు. కానీ ఇప్పటివరకు ఐదు శాతం దరఖాస్తులకే పరిష్కారం చూపారు.

ఆ మూడు విభాగాల్లోనూ..

భూ సమస్యల్లో ప్రధానమైన మూడు అంశాలున్నాయి. వీటిలో డేటా కరెక్షన్ కోసం 5,504 దరఖాస్తులు రాగా, వీటిలో 392 అర్జీలకు ఆమోదముద్ర వేశారు. 36 దరఖాస్తులను తిరస్కరించి, మరో 300 క్యాన్సల్ చేశారు. 4,776 అర్జీలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉండటం గమనార్హం. సక్సేషన్ కోసం 235 దరఖాస్తులు అందగా, వీటిలో ఇప్పటి వరకు 42కు ఆమోదముద్ర వేశారు. ఒకటి తిరస్కరించారు. మరో 10 దరఖాస్తులను క్యాన్సల్ చేశారు. మరో 182 పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇక మ్యూటేషన్ కోసం 155 రాగా, వీటిలో 25 మాత్రమే ఆమోదం తెలిపారు. తొమ్మిది తిరస్కరించగా.. 121 పెండింగ్‌లో పెట్టారు. చేవెళ్లలో అత్యధికంగా 84 దరఖాస్తులు, జిల్లేడుచౌదరిగూడలో 59 అర్జీలు ఆమోదం పొందాయి. ఇప్పటికీ భూ బాధితులు తమ సమస్యలను పరిష్కరించాల్సిందిగా కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో మెజార్టీ సమస్యలు భూ బాధితుల నుంచే అందుతుండటం గమనార్హం.

అదనపు కలెక్టర్ వద్దే 4,600

'ధరణి' పోర్టల్‌లో అన్ని దరఖాస్తులను కలెక్టరే స్వయంగా ఆమోదించడమో? తిరస్కరించడమో? చేయాల్సి వచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి స్థానంలో భూ భారతి పోర్టల్‌ను తీసుకొచ్చింది. సాంకేతికంగా పలు సంస్కరణలను కూడా ప్రవేశపెట్టింది. అప్పటి వరకు కలెక్టర్‌కు మాత్రమే ఉన్న లాగిన్‌ను ఆ తర్వాత తహసీల్దార్, ఆర్డీఓ, అదనపు కలెక్టర్లకు కూడా కల్పించింది. ఆయా అధికారుల పరిధిలోనే మెజార్టీ సమస్యలు పరిష్కారం అవుతాయని భావించారు. కానీ జిల్లాలోని ఒక్క అదనపు కలెక్టర్(రెవెన్యూ) వద్దే 4,600 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు మరికొంత సమయం పడుతుందని, భూ బాధితులంతా ఓపిక పట్టాలని సూచిస్తూ ఆయన చాంబర్ ఎదుట నోటీసు బోర్డు పెట్టడం గమనార్హం.

మంచాలలో అత్యధికం

భూ భారతి సదస్సుల్లో భాగంగా మంచాల మండలంలో అత్యధికంగా 2,943 దరఖాస్తులు అందగా, వీటిలో 2,942 మందికి నోటీసులు జారీ చేశారు. వీటిలో డేటా కరెక్షన్ కోసం 86 అర్జీలు రాగా, ఇప్పటి వరకు కేవలం ఒక దరఖాస్తును మాత్రమే ఆమోదించారు. మిగిలినవన్నీ ఇప్పటికీ పరిశీలన దశలోనే ఉన్నాయి. చేవెళ్ల మండలంలో 1,009 దరఖాస్తులు అందగా, అధికారులు పరిశీలించి వీటిలో 364 అర్జీలను తిరస్కరించారు. మిగిలిన 645 అప్లికేషన్లలో 310 ఆమోదించారు. మరో 335 పెండింగ్‌లో పెట్టారు. యాచారంలో 2,082 దరఖాస్తులు అందగా, వీటిలో కేవలం 33 మాత్రమే ఆమోదించారు. ఇక కందుకూరులో 1,842 దరఖాస్తులకు 34 దరఖాస్తులు మాత్రమే ఆమోదం పొందాయి. ఇలా కేవలం ఈ మూడు మండలాల్లోనే కాదు జిల్లా వ్యాప్తంగా ఉన్న 27 మండలాల నుంచి 22,139 దరఖాస్తులు అందగా, ఇప్పటి వరకు 1,011 అర్జీలు మాత్రమే ఆమోదించారు. మిగిలిన వారికి కేవలం నోటీసులు జారీ చేసి వదిలేశారు.



బాలాపూర్ గణేశ్ నిమజ్జన రూట్‌ను పరిశీలిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

గణేశ్ ఉత్సవాలకు పటిష్ట భద్రత

డీసీపీ సునీతారెడ్డి

పహాడీషరీఫ్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాలాపూర్ గణేశ్ ఉత్సవాలకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చూడాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. మల్లాపూర్‌లో బుధవారం ఆమె అన్ని శాఖల అధికారులు, ఉత్సవ సమితి నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రసిద్ధిగాంచిన బాలాపూర్ వినాయక ఉత్సవాలకు ఏటా భక్తులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో విచ్చేయడాన్ని దృష్టిలో ఉంచుకొని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు వినాయక నిమజ్జన రూట్‌లో రోడ్డుపై అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా మండపంతో పాటు పరిసరాలలో సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ శాఖ తరఫున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా నిమజ్జనం సందర్భంగా లడ్డూ వేలం పాట రోజున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మండపం నుంచి చాంద్రాయణగుట్ట రూట్‌లోని గుర్రం చెరువు కట్ట మైసమ్మ వరకు మార్గాన్ని పరిశీలించారు. సమావేశంలో అదనపు డీసీపీ సత్యనారాయణ, టీజీఎస్‌పీడీసీఎల్ మహేశ్వరం డీఈ గోపాలకృష్ణ, బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, బడంగ్‌పేట్, జల్‌పల్లి మున్సిపాలిటీల కమిషనర్లు సరస్వతి, బి.వెంకట్రామ్, మహేశ్వరం ఏసీపీ జానకీరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయక చవితి జరుపుకోవాలి: ఏసీపీ

యాచారం: వినాయక చవితి పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు నిర్వాహకులకు సూచించారు. యాచారంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం వినాయక మండపాల నిర్వాహకులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగ వేళ నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండపాల వివరాలను పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. డీజేలు పెట్టరాదని, ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదని పేర్కొన్నారు. విగ్రహాలను ఏ ప్రాంతంలో నిమజ్జనం చేస్తున్నారో ముందే సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాధారాణి, ఉప తహసీల్దార్ కీర్తిసాగర్, యాచారం, గ్రీన్ ఫార్మాసిటీ సీఐలు నందీశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, ఎంపీఓ శ్రీలత, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



3కే రన్ సందర్భంగా మాట్లాడుతున్న మంత్రి శ్రీహరి

పట్టుదలతోనే క్రీడల్లో రాణింపు

మంత్రి వాకిటి శ్రీహరి

హుడాకాంప్లెక్స్: కృషి, పట్టుదల ఉంటే క్రీడల్లో రాణించవచ్చని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2025 స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చారని చెప్పారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా బుధవారం 'రాజీవ్ గాంధీ ఖేల్ ఉత్సవ త్రికే రన్' పేరిట ఓమ్నీ ఆస్పత్రి నుంచి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వరకు నిర్వహించారు. ఈ రన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మధుయాస్కీగౌడ్, క్రీడా ప్రాధికారిక సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ యువత డ్రగ్స్, మద్యపానానికి అలవాటు పడొద్దని, పాఠశాల, కళాశాల అయిపోయిన వెంటనే గ్రౌండ్‌కు పరుగులు తీయాలన్నారు. 2035లో ఒలింపిక్ పోటీలలో పాల్గొనేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. నేడు తల్లిదండ్రులు సైతం పిల్లలను ఆటల్లో ప్రోత్సహిస్తున్నారని గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి క్రీడాకారుడు మత్తు వదిలి మైదానం బాట పట్టమని రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారని తెలిపారు. ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధిస్తే శంషాబాద్ నుంచి భారీ ర్యాలీ తీసి గౌరవిస్తామని, కోచ్‌ల కొరత లేకుండా చేస్తామన్నారు. శిక్షణ ఇచ్చేలా త్వరలో మైదానాలు అందుబాటులో ఉంచుతామని వివరించారు. స్టేడియంలో జిమ్ ఇతర వసతులు కల్పించడానికి రూ.200 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు ఉపేందర్‌రెడ్డి, జిల్లా క్రీడా అధికారి వెంకటేశ్వర్‌రావు, కోశాధికారి రాజశేఖర్, కోచ్‌లు విజయ్‌కుమార్, సాయిబాబా, రమాదేవి, యాదయ్య, జనయ్‌సింగ్, కిషోర్, సైదులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు మెరుగవ్వాలి

జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

ఇబ్రహీంపట్నం రూరల్: సంగారెడ్డి జిల్లా పాశమైలారం వంటి సంఘటనలు పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు మెరుగుపర్చాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆమె అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా పాశమైలారం వంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా తనిఖీలు–తెలంగాణ ప్రభుత్వం లేబర్, ఎంప్లాయిమెంట్, ట్రైనింగ్ ఫ్యాక్టరీస్ విభాగం జారీ చేసిన జీవో ఆర్టీ నంబరు 331 ప్రకారం జిల్లా కలెక్టర్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. వాటి ద్వారా తక్షణమే పరిశ్రమల ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. అన్ని కెమికల్ పరిశ్రమల్లో నిబంధనలు తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. కార్మికుల భద్రతే ముఖ్యమని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, పీసీబీ ఈఈఈ వెంకట నర్సు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆఫ్ ఫ్యాక్టరీ ఎన్‌జీ వైదేహి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో అధికారులతో డీఆర్‌ఓ సంగీత

మహాధర్నాను విజయవంతం చేయండి

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి



అజీజ్‌నగర్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

మొయినాబాద్/శంకర్‌పల్లి: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ 1న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి కోరారు. బుధవారం మొయినాబాద్ మున్సిపాలిటీలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాధర్నా వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అయిన పెన్షన్‌ను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి క్రిష్టారెడ్డి, ఎంఈఓ మల్లయ్య, మండల అధ్యక్షుడు బందయ్య, హెచ్‌ఎంలు రఘునాథ్, శేఖర్‌రెడ్డి, అబ్దుల్ హమీద్, నాయకులు వెంకటయ్య, హమీద్, లక్ష్మణ్, రాములు, శివకుమార్, భీమ్లా, యాదగిరి, విజయ్ కుమార్, విజయబాయ్, రాధా, శారద, శ్రీదేవి, మంగ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

డ్వాక్రా అక్రమాల వడపోత

నిధుల స్వాహాపై విచారణ

- చౌదర్‌పల్లిలో అవకతవకలపై ఏపీఎంలకు షోకాజ్ నోటీసులు
- మహిళా సంఘాల్లో భారీ గోల్‌మాల్
- లోతుగా పరిశీలిస్తున్న అధికారులు
- త్వరలోనే చట్టపరమైన చర్యల దిశగా అడుగులు
- జిల్లా వ్యాప్తంగా సీసీల బదిలీలకు రంగం సిద్ధం



ఐకేపీ అధికారులతో సమావేశమై వివరాలు సేకరిస్తున్న డీపీఎం యాదయ్య

యాచారం: గ్రామ స్వయం సహాయక సంఘాల్లో నిధుల స్వాహా, అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు అధికార యంత్రాంగం వడపోత ప్రారంభించింది. ఏడాది వ్యవధిలోనే మండల పరిధిలోని మల్కీజ్‌గూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లో రూ.లక్షల నిధులు దుర్వినియోగంపై జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పుట్టను తవ్వి అక్రమాల పాములను పట్టేందుకు అటు ఐకేపీ, ఇటు ఎస్‌బీఐ ఉన్నతాధికారులు విచారణను ముమ్మరం చేశారు. మహిళల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకున్న అధికారులు ఫోర్జరీ సంతకాలు, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి సంఘాలకు చెందాల్సిన నిధులను స్వాహా చేశారు. ఏడాదికి ఒక గ్రామంలో అక్రమాలు వెలుగులోకి వస్తుండడం, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు, రికవరీ లేకపోవడంతో మిగతా గ్రామాల్లో అవినీతి వ్యవహారం రాజ్యమేలుతోంది. మండలాల్లోని స్వయం సహాయక సంఘాల్లో నిధుల గోల్‌మాల్‌పై విచారణ పూర్తి చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

విచారణకు ప్రత్యేక కమిటీ

చౌదర్‌పల్లి గ్రామ స్వయం సహాయక సంఘాల్లో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై నిగ్గు తేల్చేందుకు డీఆర్‌డీఓ శ్రీలత ప్రత్యేక విచారణ కమిటీని నియమించారు. కమిటీలో ఇద్దరు డీపీఎంలు యాదయ్య, లీలాకుమారి, ఇద్దరు ఐకేపీ ఆడిటర్లు శ్రీనివాస్, మధు ఉంటారు. ప్రత్యేక విచారణ కమిటీకి స్థానిక ఏపీఎం రవీందర్ సహకారం అందిస్తారు. పది రోజుల్లోనే పూర్తి నివేదిక అందజేయనుంది. చౌదర్‌పల్లిలో వీబీకే వరలక్ష్మి పర్యవేక్షణ చేస్తున్న 30 స్వయం సహాయక సంఘాల్లోని ఆర్థిక లావాదేవీలపై 2020 నుంచి విచారణ చేయనున్నారు. వాటికి సంబంధించి పొదుపు, లోన్, స్త్రీనిధి అకౌంట్లు యాచారం ఎస్‌బీఐలో స్టేట్‌మెంట్లు తీసుకుని పరిశీలించనున్నారు. శుక్రవారం నుంచి గ్రామంలోని సంఘాల మహిళలతో ప్రత్యేక సమావేశమై వివరాలు సేకరించనున్నారు. యాచారం ఎస్‌బీఐలో 2020 నుంచి మేనేజర్ల అక్రమాలు, నిబంధనలకు విరుద్ధంగా సంఘాల్లో లేని మహిళల పేర్ల మీద డబ్బులు జమ చేయడంపై బ్యాంక్ ఏజీఎం రామకృష్ణయ్య ఆధ్వర్యంలో విచారణ చేస్తున్నారు. అప్పటి ఎస్‌బీఐ మేనేజర్ ఝాన్సీరాణి నాటి మల్కీజ్‌గూడ, నేటి చౌదర్‌పల్లి గ్రామాల్లోనే కాక బ్యాంకు పరిధి కింద ఉన్న పలు గ్రామాల్లో ఐకేపీ సిబ్బందితో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు.

షోకాజ్ నోటీసులు జారీ

ఏడాదిలోనే మల్కీజ్‌గూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లో డ్వాక్రా సంఘాల్లో రూ.లక్షల నిధుల గోల్‌మాల్ అక్రమాలపై పర్యవేక్షణ చేయని ఏపీఎంలు(బదిలైన) సుదర్శన్‌రెడ్డి, సాంబశివుడు, సీసీ జంగయ్యకు డీఆర్‌డీఓ శ్రీలత బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నాలుగైదు రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. వివరణ సంతృప్తికరంగా లేకపోతే శాఖపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో ఏళ్లుగా అదే స్థానంలో పని చేస్తున్న సీసీ(కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు)లు కూడా పట్టించుకోవడం లేదని అధికారుల దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో వారం, పది రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న సీసీలను బదిలీలు చేసేలా అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

నివేదిక ఆధారంగా చర్యలు




చౌదర్‌పల్లిలో డ్వాక్రా గ్రూపుల్లో జరిగిన నిధుల గోల్‌మాల్ అక్రమాలపై ఓ నలుగురు సభ్యులతో ప్రత్యేక బృందాన్ని నియమించాం. ఈ కమిటీ వారంలో నివేదిక అందజేయనుంది. బాధ్యులైన వారిపై చర్యలుంటాయి. ఇద్దరు ఏపీఎంలు, సీసీకి షోకాజ్ నోటీసులు జారీ చేశాం. అక్రమాలకు పాల్పడే వీబీకేలపై కూడా చర్యలు తప్పవు.

– శ్రీలత, డీఆర్‌డీఓ

ప్రభుత్వ ఆఫీసుల్లో అవినీతి రాజ్యం!

- చేయి తడిపితేనే ఫైల్ కదిలేది
- ఏసీబీకి పట్టుబడుతున్నా తీరు మారని వైనం



తాండూరు: ప్రభుత్వ ఆఫీసుల్లో అవినీతి రాజ్యమేలుతోంది. లంచావతారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఓ వైపు ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్నా వీరి ఆగడాలు మాత్రం ఆగడం లేదు. వివిధ పనుల నిమిత్తం తాండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని కార్యాలయాలకు వచ్చే ప్రజలను కొంతమంది ఉద్యోగులు పీక్కు తింటున్నారు. చేయి తడిపితేనే ఫైలు కదిలేది అనే విధంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంతో పాటు తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, విద్యుత్, ఎక్సైజ్, మైన్స్, ఆర్అండ్‌బీతో పాటు మరికొన్ని ప్రధాన శాఖలు అవినీతిమయంగా మారాయి.

- తాండూరు మున్సిపల్ పరిధిలోని 7వ వార్డుకు చెందిన ఓ పార్టీ నాయకుడు తమ కాలనీలో ఇళ్లు కట్టుకున్న వారికి ఇంటి నంబర్ కేటాయించాలని మున్సిపల్ ఆఫీసులోని సీనియర్ అసిస్టెంట్‌ను రమేశ్‌ను కలిశాడు. ఇందుకు ఆయన ఒక్కో ఇంటికి రూ.6 వేలు ఇవ్వాలంటూ పది ఇళ్లకు రూ.60 వేలు వసూలు చేశాడు. లబ్ధిదారుల నుంచి ఈ మొత్తం ఇప్పించడంతో వారికి ఇంటి నంబర్లు కేటాయించారు. అనంతరం ఇదే నాయకుడు తాను నిర్మించుకున్న రేకుల షెడ్డుకు ఇంటి నంబర్ ఇవ్వాలని కోరగా రమేశ్ రూ.20 వేలు డిమాండ్ చేశాడు. రూ.15 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అన్ని ఆధారాలతో ఏసీబీకి ఫిర్యాదు చేసినా నెల రోజుల పాటు కాలయాపన చేశారని, దీంతో నేరుగా ఐజీకి ఫోన్ చేయడంతో అప్రమత్తమైన జిల్లా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా సీనియర్ అసిస్టెంట్‌ను పట్టుకున్నారని బాధితుడు తెలిపాడు.
- దాడులు జరుగుతున్న విషయం తెలియడంతో కమిషనర్ విక్రంసింహారెడ్డితో పాటు సిబ్బంది మొత్తం అక్కడి నుంచి పలాయనం చిత్తగించారు. ఆ తర్వాత ఫోన్లు ఆఫ్ చేసుకున్నారు. దీంతో ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందో తేల్చాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రమేశ్‌ను ఏసీబీకి పట్టించిన వ్యక్తి 2022 డిసెంబర్‌లో తాండూరు సబ్ రిజిస్ట్రార్ జమీరొద్దీన్‌ను సైతం అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టించాడు.
- తాండూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. గతంలో డీఏఓ దానయ్య, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావు రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే.

చంపుతామని బెదరిస్తున్నారు..


పోలీసులకు ఫిర్యాదు చేసిన కాపీని చూపిస్తున్న ఇర్షాద్

తాండూరు టౌన్: మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమేశ్‌ను ఏసీబీకి పట్టించానన్న కక్షతో తనను చంపుతామని బెదిరిస్తున్నారని బాధితుడు ఇర్షాద్ వాపోయాడు. ఈ మేరకు బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రమేశ్ తమ్ముడు నాగేశ్‌తో పాటు బాతుల నాగు వ్యక్తి మున్సిపల్ ఆఫీసులో తనను బెదిరించారని తెలిపాడు. వీరి నుంచి తనకు ప్రాణహాని ఉందని పేర్కొన్నాడు. ఈ విషయమై సీఐ సంతోష్‌కుమార్‌ను అడగగా సాక్ష్యాధారాలను పరిశీలించి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

పోలీసులకు చిక్కిన గ్యాంగ్ రేప్ నిందితుడు


రహమతుల్లా

మంచాల: గ్యాంగ్ రేప్ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని మంచాల పోలీసులు బుధవారం చాకచక్యంగా పట్టుకున్నారు. సీఐ మధు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గుజరాత్ రాష్ట్రం బచ్చావ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2006లో గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన నిందితుడు సికిందర్ రహమతుల్లా 2014 వరకు శిక్ష అనుభవించాడు. 2014లో పెరోల్‌పై బయటకు వచ్చి, పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. ఇతని కోసం గుజరాత్ పోలీసులు 11 ఏళ్లుగా గాలిస్తున్నారు. సాంకేతిక ఆధారాలతో మంచాల మండలంలోని లింగంపల్లి సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. ఓ కోళ్ల ఫారంలో పనిచేస్తున్న రహమతుల్లాను పట్టుకున్న స్థానిక పోలీసులు గుజరాత్ పోలీసులకు అప్పగించారు.

లాడ్జి గదిలో వ్యక్తి మృతి

కొత్తూరు: లాడ్జి గదిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తూరు పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల మేరకు.. కేశంపేట మండలం సంగెం గ్రామానికి చెందిన జోగన్నగూడెం రమేశ్(37) ఈ నెల 19న పని ఉందని ఇంట్లో చెప్పి కొత్తూరుకు వచ్చాడు. కొంత కాలంగా ఆయనకు మూర్ఛా, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. కాగా పట్టణంలోని ఓ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకుని మద్యం తాగాడు. మధ్యరాత్రి లాడ్జి సిబ్బంది గమనించగా పడుకున్న చోటనే రమేశ్ విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సెకండ్ 'హ్యాండ్'!


పట్టుబడిన నిందితులతో పోలీసులు

మోసగాళ్లు తెలివిమీరుతున్నారు. జనాన్ని మోసం చేసి ఈజీగా మనీ సంపాదించడం కోసం కొత్తదారులు వెతుక్కుంటున్నారు. కార్లను అద్దెకు తీసుకుని, ఫేక్ నంబర్లు, ఆర్సీ తయారు చేసి ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నారు. అదే కారును తస్కరించి, తిరిగి యజమానులకు అప్పగిస్తున్నారు. ఈ ముఠాను మాచారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్ర ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

అద్దెకు తెచ్చి.. ఫేక్ నంబర్ తయారు చేసి

- ఫేస్‌బుక్ ద్వారా తక్కువ ధరకు విక్రయం
- ఆపై అదే కారును చోరీ చేసి.. యజమానికి అప్పగింత
- ముఠా గుట్టురట్టు చేసిన మాచారెడ్డి పోలీసులు
- ఆరుగురు నిందితుల అరెస్ట్, పరారీలో మరొకరు
- వివరాలు తెలిపిన ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి చెందిన ఉప్పల్వాయి ప్రశాంత్ గౌడ్ ఫేస్‌బుక్ అప్లికేషన్‌లో చూసి సెకండ్ హ్యాండ్ కారును కొనుగోలు చేశాడు. ఆ మరుసటి రోజు ఓ వ్యక్తి వచ్చి అది తన కారని చెప్పి తీసుకుపోయాడు. కారు విక్రయించిన వ్యక్తులకు ఫోన్ చేయగా.. అందుబాటులోకి రాలేదు. దీంతో ఆయన గతనెల 7వ తేదీన మాచారెడ్డి పీఎస్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపగా కొత్త రకం మోసం వెలుగు చూసింది. కొందరు ముఠాగా ఏర్పడి సెకండ్ హ్యాండ్ కార్ల విక్రయాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలించారు.

ముఠాగా ఏర్పడి..

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపీనగర్‌కు చెందిన మహమ్మద్ ఇయాజ్, వికారాబాద్‌లోని ఆలంపల్లికి చెందిన మహమ్మద్ జాహీద్ అలీ, సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురానికి చెందిన పృథ్వి జగదీష్, రాచర్ల శివకృష్ణ, వేములవాడకు చెందిన వివేక్, శేరిలింగంపల్లి మండలానికి చెందిన కర్ణకోట సాకేత్, అలీ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరు ముందుగా ట్రావెల్స్ సంస్థల నుంచి వ్యక్తిగతంగా ఇచ్చే సెల్ఫ్ డ్రైవింగ్ కార్లను అద్దెకు తీసుకుంటారు. వాటి నంబర్ ప్లేట్లు మార్చేసి నకిలీ ఆర్సీ, ఇతర పత్రాలు సృష్టిస్తారు. అనుమానం రాకుండా నకిలీ ఆర్సీ తయారు చేయడానికి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లలో ఖాళీ మైక్రో సిమ్ కార్డులు, ఖాళీ చిప్ కార్డులను కొంటారు. వాటిపై పేర్లు, వివరాలను ప్రింటింగ్ చేస్తారు. అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ఇతర పత్రాలన్నీ తయారు చేస్తారు. ఆపై ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో కారు అమ్మకానికి ఉందని పెట్టి, తక్కువ ధరకే వాటిని అమ్మనున్నట్లు పేర్కొంటారు. కారు, చౌక ధరను చూసి ఆకర్షితులైనవారు వారి వలలో చిక్కుతున్నారు.

ట్రాకర్లను అమర్చి చోరీ..

కారును అమ్మేటప్పుడు దాంట్లో జీపీఎస్ ట్రాకర్‌ను అమరుస్తారు. దీంతో కారు ఎక్కడుందో వారికి తెలిసిపోతుంది. కారున్న చోటుకు వెళ్లి రాత్రికి రాత్రి వారు విక్రయించిన కారునే చోరీ చేసి తీసుకువచ్చి అసలు యజమానికి అప్పగిస్తున్నారు. అలా వీలు కాని సందర్భాల్లో ఇతరులను పంపి కారు మాది అంటూ బెదిరింపులకు పాల్పడి ఎత్తుకొస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని కారు అమ్మిన తర్వాత రెండు నుంచి మూడు రోజుల వ్యవధిలో పూర్తి చేస్తున్నారు.

నిందితులపై పలు కేసులు..

నిందితులు ఈ విధంగా గతంలోనూ పలు చోట్ల నేరాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. శంకర్‌పల్లి, మంచాల, అంబారిపేట, రామచంద్రాపురం, చందానగర్, మియాపూర్, అత్తాపూర్ పోలీస్ స్టేషన్లలో నిందితులపై పలు కేసులు నడుస్తున్నాయని ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. మాచారెడ్డిలో కేసు నమోదైన నాటి నుంచి పరారీలో ఉన్న వారిలో ఆరుగురిని అరెస్ట్ చేశామన్నారు. వారిని బుధవారం రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నిందితుడు అలీ ఇంకా పరారీలో ఉన్నాడన్నారు. నిందితుల వద్ద నుంచి మూడు కార్లు, 15 సెల్‌ఫోన్‌లు, జీపీఎస్ పరికరాలు, ల్యాప్‌టాప్, 10 మైక్రో సిమ్‌కార్డులు, చిప్ కార్డులు, ఫోర్జరీ చేసిన ఆర్సీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన రూరల్ సీఐ రామన్, ఎస్సై అనిల్, ఐటీ సెల్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది సుభాష్‌రెడ్డి, సిద్ధిరాములు, శ్రీకాంత్‌లను అభినందించారు. సమావేశంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, అధికారులు పాల్గొన్నారు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు దుర్మరణం

నందిగామ: గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో ఓ వృద్ధురాలు దుర్మరణం పాలైంది. ఈ సంఘటన మండల పరిధిలోని చాకలిదానిగుట్టతండా సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తండావాసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. తాటిగడ్డతండాకు చెందిన జటావత్ చాందిని(63) మంగళవారం సాయంత్రం నందిగామలో కూరగాయలు అమ్ముకొని, ఇంటికి వెళ్తుండగా తండా సమీపంలోని కల్వర్టు వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై, కల్వర్టు గుంతలో పడి చనిపోయింది. బుధవారం ఉదయం ఇది గమనించిన తండావాసులు కుటుంబ సభ్యులు, పోలీసులకు తెలిపారు. మృతురాలి భర్త గోవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం


పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

వెంగళరావునగర్: నగరంలోని కాలనీలు, బస్తీలు నిరంతరం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్–19 పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ.. పరిశుభ్రత, ప్రజారోగ్యం.. ఈ రెండూ విడదీయరాని అంశాలని, పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని చెప్పారు. ఆరోగ్యకర నగర నిర్మాణమే లక్ష్యంగా మాన్సూన్ శానిటేషన్ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్టు పేర్కొన్నారు. నగర ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో క్రియాశీలక భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వానలు తగ్గుముఖం పట్టినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసేందుకు నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కర్ణన్ సూచించారు. అనంతరం సర్కిల్ పరిధిలోని జీహెచ్ఎంసీ కార్యాలయం, జానకమ్మతోట, రహమత్‌నగర్, ఎస్‌సీఆర్ హిల్స్, బోరబండ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో సమీక్షించారు. కర్ణన్ వెంట శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్డే హేమంత్ సహదేవ్‌రావు, హెల్త్ అండ్ శానిటేషన్ అదనపు కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్, సర్కిల్–19 ఉప కమిషనర్ రజనీకాంత్ రెడ్డి, ఏసీపీ ప్రసీద, డీఈఈ భద్రు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

రూ.50 వేలు ఇవ్వకుంటే వీడియో వైరల్ చేస్తా..

- యువకుడికి క్యాబ్‌డ్రైవర్ బెదిరింపులు
- పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్: 'వెనుక కూర్చొని మీరు చేసిన పనులన్నీ గమనించా..వీడియో తీశా..వీటిని సోషల్ మీడియాలో వైరల్ చేయకుండా ఉండాలంటే రూ.50 వేలు ఇవ్వాలి' అంటూ బెదిరింపులకు పాల్పడిన క్యాబ్ డ్రైవర్‌పై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కవాడిగూడకు చెందిన అహ్మద్ అనే యువకుడితో పాటు మరో యువతి హైటెక్ సిటీలో ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నారు. వీరిద్దరూ స్నేహితులు. ఈ నెల 17వ తేదీన వీరిద్దరూ విధులు ముగిసిన తర్వాత సాయంత్రం 5.30 గంటలకు కవాడిగూడ వెళ్లేందుకు క్యాబ్ మాట్లాడుకున్నారు. జహీరాబాద్‌కు చెందిన క్యాబ్ డ్రైవర్ శ్రీనివాస్ వీరిద్దరినీ ఎక్కించుకుని వెళ్తుండగా మార్గమధ్యలో బంజారాహిల్స్ రోడునెంబర్–2లోని టీవీ–9 సమీపంలో ఓ స్నేహితుడిని కలిసేందుకు 20 నిమిషాలు ఆగి..తిరిగి బయలుదేరారు. వీరిద్దరినీ కవాడిగూడలో దింపిన తర్వాత అహ్మద్ జీపే ద్వారా బిల్లు చెల్లించాడు. ఈ నెల 19వ తేదీ రాత్రి అహ్మద్‌కు ఓ మేసేజ్ వచ్చింది. నువ్వు వెనుక కూర్చొని ఆ అమ్మాయితో ఏమేమీ చేశావో అన్నీ తాను రికార్డ్ చేశానని, వీటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయకుండా ఉండాలంటే రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. గంటసేపటిలోగా డబ్బులు ఇవ్వకపోతే వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని హెచ్చరించాడు. తన వద్ద అంత డబ్బు లేదని, తాను చిన్న ఉద్యోగినని అహ్మద్ చెప్పగా, ఒక రోజు గడువు ఇస్తున్నానని, తెల్లారిలోగా రూ.50 వేలు తెచ్చివ్వాలని హెచ్చరించాడు. దీంతో బాధితుడు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఊబర్ క్యాబ్ డ్రైవర్ శ్రీనివాస్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 77, 308 (3), 351 (2), ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఖజానా' కేసులో మరో ఇద్దరి అరెస్ట్

పుణేలో అంతర్రాష్ట్ర దొంగల్ని అదుపులోకి తీసుకున్న సైబరాబాద్ పోలీసులు

చందానగర్: 'ఖజానా' జ్యువెలరీలో దోపిడీకి సంబంధించి మరో ఇద్దరు దొంగలను పుణేలో సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం చందానగర్ డీఐ భాస్కర్ వివరాలు వెల్లడించారు. ఖజానా దొంగతనం కేసులో ఏడుగురు పాల్గొనగా ఇప్పటి వరకు నలుగుర్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే బిహార్‌కు చెందిన అశిష్, దీపక్ కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, మరో ఇద్దరు కూడా బిహార్‌కు చెందిన అనిష్ కుమార్ సింగ్, ప్రిన్స్ కుమార్ రజాక్‌లుగా గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. వీరిద్దరిని కూడా రిమాండ్‌కు తరలించామన్నారు. వారి వద్ద నుంచి 1015 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక పిస్టోల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగితా ముగ్గుర్ని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

హజ్ యాత్రకు 4,292 మంది ఎంపిక

సాక్షి సిటీబ్యూరో: హజ్ యాత్ర–2026కు కంప్యూటర్ డ్రా పద్ధతిలో రాష్ట్ర వ్యాప్తంగా 4,292 మంది యాత్రికులు ఎంపికయ్యారని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ ఆఫ్జల్ బియబానీ ఖుస్రో పాషా తెలిపారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ హజ్ యాత్రకు తెలంగాణ నుంచి 11,757 మంది దరఖాస్తు చేసుకోగా.. 4,292 మందిని డ్రా పద్ధతిలో ఎంపిక చేసినట్లు తెలిపారు. నగరం నుంచి అత్యధికంగా 2,210 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికై న యాత్రికులు మొదటి విడుతగా రూ.1,52,300 ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. దస్త్రావేజులు ఈ నెల 30వ తేదీలోపు హజ్ కమిటీ కార్యాలయంలో జమ చేయాలని సూచించారు. ఇంకా మరింత సమాచారం కోసం హజ్ కమిటీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కొత్వాల్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ కోర్టు

సాక్షి, సిటీబ్యూరో: అదనపు జిల్లా మేజిస్ట్రేట్ అధికారాలు కలిగిన నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ బుధవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఎగ్జిక్యూటివ్ కోర్టు నిర్వహించారు. సౌత్, సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్ జోన్లలో ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్న రౌడీషీటర్లు, క్రిమినల్ గ్యాంగ్‌ల సమస్యను పరిష్కరించారు. పోలీసుస్టేషన్ల నుంచి వచ్చిన నివేదికలను పరిశీలించిన కొత్వాల్ ఆయా గ్యాంగ్‌లు పరస్పరం దాడులు, హత్యలు, హత్యాయత్నాలు వంటి నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. మొత్తం పది పోలీసుస్టేషన్లకు సంబంధించిన 11 గ్యాంగ్‌లకు చెందిన 101 మందిని విడిగా విచారించారు. అందులో ఆరు గ్యాంగ్‌లు తమ పెద్దలు, కుటుంబీకుల సమక్షంలో శాంతియుతంగా రాజీ చేసుకున్నామని కొత్వాల్‌కు తెలిపాయి. మిగిలిన గ్యాంగ్‌లు భవిష్యత్తులో కూడా శాంతియుతంగా ఉంటామని హామీ ఇచ్చాయి. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వర్షాలకు కూలిన ఇళ్లు


చేవెళ్ల: ఆలూరులో కూలిన ఇల్లు


షాబాద్: సర్ధార్‌నగర్‌లో కూలిన ఇల్లు

చేవెళ్ల: భారీ వర్షాల కారణంగా మండలంలోని ఆలూరు గ్రామంలో ఓ పాత ఇల్లు కూలింది. గ్రామానికి చెందిన షాబాద్ పెంటయ్యది మట్టిగోడలతో పెట్టిన ఇల్లు కావటంతో వర్షాలకు బాగా తడిసి మంగళవారం రాత్రి ఒక్కసారిగా కూలింది. పాత ఇల్లు కావటంతో పాటు వర్షాల కారణంగా ఇల్లు తడిసిపోయిందని బాధితుడు పెంటయ్య పక్కనే వేరే ఇంట్లో ఉంటున్నట్లు తెలిపాడు. ఇంట్లో ఎవరు లేకపోవటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపాడు. తమను ఆదుకోవాలని కోరుతున్నాడు.

సర్ధార్‌నగర్‌లో..

షాబాద్: గత మూడురోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం మండల పరిధిలోని సర్ధార్‌నగర్ గ్రామానికి చెందిన కాసమోని వెంకటేశ్ ఇల్లు భారీ వర్షాలకు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం వెంటనే స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి

ఎస్ఐ యాదగిరి


మాట్లాడుతున్న ఎస్ఐ

దుద్యాల్: గణపతి మండపాలకు పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ యాదగిరి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27న వినాయక చవితి పురస్కరించుకుని మండలంలోని ప్రతీ గ్రామంలో వినాయకుల ప్రతిమలను ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుంది. అందుకుగాను మండల వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న వినాయక మండపాలకు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలన్నారు. దీనికోసం రాష్ట్ర పోలీస్ శాఖ ఒక ప్రత్యేక వెబ్ సైట్ రూపొందించిందన్నారు. ఈ వెబ్ సైట్‌లో మండపాలకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేస్తే అనుమతి లభిస్తుందని తెలిపారు. ఈ అనుమతి ఉంటేనే అవసరమైన సమయంలో పోలీస్ బందోబస్త్ ఏర్పాటుకు అవకాశం ఉంటుందని ఆయన సూచించారు.

సిటీలో ఎక్కడ చూసినా సమస్యలే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శ

కాచిగూడ: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పార్టీ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ కార్యకర్తలు ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. సమస్యలను సంబంధిత అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చూడాలని ఆయన పార్టీ కార్యకర్తలను కోరారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ నగర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు 'ఛలో సెక్రటేరియట్ – సేవ్ హైదరాబాద్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలో ఎక్కడ చూసినా నీళ్లు విద్యుత్, డ్రైనేజీ, రోడ్ల సమస్యలే దర్శనమిస్తున్నాయని తెలిపారు. బీజేపీ నేతలు ఎన్.గౌతంరావు, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

రామంతాపూర్ విషాదంపై లోకాయుక్త స్పందన


సుమోటోగా కేసు నమోదు, నోటీసులు జారీ

సాక్షి, సిటీబ్యూరో: రామంతాపూర్‌లోని గోఖలేనగర్‌లో కృష్ణాష్టమి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కృష్ణుడి శోభాయాత్రలో చోటు చేసుకున్న విద్యుత్ షాక్ విషాదంపై లోకాయుక్త స్పందించింది. విద్యుత్ షాక్‌తో ఐదుగురు చనిపోవడంపై సుమోటోగా కేసు నమోదు చేశారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా మేడ్చల్ కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్, టీజీఎస్పీడీసీఎల్ ఎస్ఈ, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్లకు బుధవారం నోటీసులు జారీ చేశారు.

ఆలయాల్లో భారీ చోరీ

- రూ.లక్షకు పైగా నగదు, కానుకలు ఎత్తుకెళ్లిన దుండగులు
- సీసీ కెమెరాల వైర్లు కట్‌చేసి, ధ్వంసం చేసిన వైనం


సంగమేశ్వరాలయంలో దుండగులు ధ్వంసం చేసిన హుండీ


శనైశ్వరాలయంలో ధ్వంసమైన హుండీ

యాలాల: మండలంలోని సంగెంకుర్దు పరిధిలో ఉన్న సంగమేశ్వరాలయం, శనైశ్వరాలయంలో భారీ చోరీ జరిగింది. పక్కపక్కనే ఉన్న ఆలయాల్లోని హుండీలను ధ్వంసం చేసిన దుండగులు పెద్ద మొత్తంలో నగదు ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సంగంకుర్దు శివారులోని కాకరవేణి నది ఒడ్డున సంగమేశ్వరాలయం, దీని పక్కనే శనైశ్వరాలయం ఉంది. ఎప్పటిలాగే ఆలయ పూజారి జగదీశ్ మంగళవారం రాత్రి గేట్లు మూసేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఆలయం తెరిచేందుకు వెళ్లగా హుండీలు, సీసీ కెమెరాలు ధ్వంసమైనట్లు గుర్తించి, చైర్మన్‌తో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ విఠల్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సంగమేశ్వరాలయ హుండీలో సుమారు రూ.50 వేల నుంచి 60 వేల వరకు నగదు, బహుమతులు, శనైశ్వరాలయంలోని హుండీలో దాదాపు రూ.50 వేల నగదు, భక్తులు వేసిన కానుకలు చోరీకి గురయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వరుసగా నాలుగో సారి..

సంగమేశ్వరాలయంలో వరుసగా నాలుగోసారి దొంగలు పడ్డారని స్థానికులు తెలిపారు. ఆలయం గ్రామానికి దూరంగా ఉండటంతో ఈ దురాఘతానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆలయ అభివృద్ధికి వినియోగించే భక్తుల డబ్బులు దొంగల పాలవుతున్నాయని తెలిపారు. సీసీ కెమెరాల వైర్లను కట్ చేయడంతో పాటు ధ్వంసం చేసి చోరీలకు పాల్పడటంపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.